02ATP27_02ATP27.qxd 25-06-2025 PM 10:11 Page 1



## స్థల వివాదం సృష్టిస్తే చర్యలు తప్పవు

### - ఈఓ ను హెచ్చరించిన సిఐ



ఈఓ ను హెచ్చరిస్తున్న సిఐ

హిందూపురం జూన్ 25 ప్రభాతవార్త

పట్టణంలోని నానెప్ప నగర్ ప్రాంతంలో ఉన్న రెండు ఎకరాల పైచిలుకు స్థలం హక్కు విషయంలో మరోసారి వివాదం తలెత్తింది. ఈ స్థలం దేవాదాయ శాఖకు చెందినదని ఈవో నాగేంద్రుడు, ఆ ప్రదేశంలో రోడ్డు పక్కన అన్యాక్రాంతంగా దుకాణాలు వేసుకున్న వారు బుధవారం ఉదయం ఈ స్థలంలో ప్రవేశించి స్థలం స్వాధీనానికి ప్రయత్నించారు. ఫెన్సింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఇప్పటికే ఐదు కోర్టుల్లో ఈ స్థలంపై తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని పేర్కొన్న హక్కుదారులు వారి చర్యలను అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న వన్టౌన్ సిఐ రాజగోపాలనాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. కొద్ది రోజుల కిందటే వివాదం జరుగగా దేవాదాయ శాఖ భూమి అనేపత్రాలను తీసుకురావాలని ఈవోనాగేంద్రుడుకు చెప్పినప్పటికీ ఇంతవరకు ఎందుకు వాటిని తీసుకురాలేదని సీఐ ప్రశ్నించారు. సుంకు బద్రీనాథ్, రాజేష్, బలరాం, కౌన్సిలర్రాఘువేంద్ర ఈస్థలానికి సంబంధించిన హక్కులపై కోర్టు తమకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు ప్రతులను వారు సిఐకు అందజేశారు. ఇదే విషయాన్ని సీఐ ప్రస్తావించారు. జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ దగ్గరకు వెళ్లి మీకు నిజంగా ఈ స్థలంపై దేవదాయ శాఖ హక్కు ఉండి ఉంటే సంబంధిత పత్రాలను అందించి వారి నుంచి ఆదేశాలు తీసుకురావాలని స్పష్టంచేశారు. అంతేగాని కొందరిని వెంటేసుకొని గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తే పోలీస్ కేసులు పెడతామని ఈవో నాగేంద్రుడు ను తీవ్రంగా హెచ్చరించారు. సీఐ మాట్లాడేటప్పుడు ఆయన అడ్డు చెప్పడానికి ప్రయత్నించగా మందలించారు. స్థల వివాదానికి సంబంధించి రెండు వర్గాలుకూడా ఇందులో ప్రవేశించరాదని కోర్టు డైరెక్షన్ తీసుకుని పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు వస్తే తామే దగ్గర ఉండి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఈ స్థలంలో రోడ్డు పక్కన 26 తాత్కాలిక దుకాణాలను వేయించి వారి దగ్గర నుంచి సుమారు రెండు లక్షల రూపాయలు బాడుగలు వసూలు చేస్తూ కేవలం దాదాపు రూ. 30,000 మాత్రమే దేవదాయ శాఖ ఖాతాకు ఈవో చెల్లిస్తున్నాడని వారు ఆరోపించారు.

## మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బోయ తిప్పేస్వామి

బ్రహ్మసముద్రం జూన్ 25 ప్రభాతవార్త



నివాళులర్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ తిప్పే స్వామి నాయకులు కార్యకర్తలతో కలిసి బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లి గ్రామం వైసిపి నాయకులు కే. మంజునాథ అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఘన నివాళులర్పించిన ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఐ గంగాధరప్ప , వైసిపి మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి కళ్యాణ్ దుర్గం కన్వీనర్ గోళ్ళ సూర్యనారాయణ పోలేపల్లి వైసిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఎంపీటీసీ లోకేష్ సర్పంచ్ శెట్టి మంజునాథ్ పోలేపల్లి నాగేంద్రప్ప ,ఎంపీటీసీ ఎస్. బుసప్ప మాజీ ఎంపీపీ మహాదేవప్ప వైసిపి మండల ఉపాధ్యక్షులు నాగరాజు బొబ్బిర్లపల్లి సర్పంచ్ మమత గంగాధర్ వైయస్ సర్పంచ్ సన్న నీలప్ప ,వైసిపి సోషల్ మీడియా మండల అధ్యక్షుడు శరణప్ప తదితరులు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఉపాధి లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈసీ జయప్రకాష్

బ్రహ్మసముద్రం జూన్ 25 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండలం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏపీఓ రవి మాట్లాడుతూ ఉపాధి హామీ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు అనంతరం ఈసీ జే ప్రకాష్ మాట్లాడుతూ హార్టికల్చర్ వారం పండుగ క్యాటిల్ షెడ్ కట్టుకున్న వారికి ఎరువు గుంతలు ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం



వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం జూన్ 25 ప్రభాతవార్త

గ్రామ వార్డు సచివాలయ అన్ని శాఖల ఉద్యోగులకు ప్రమోషన్ ఛానెల్ కల్పించి, స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలు చేసిన తర్వాత మాత్రమే ట్రాన్స్ఫర్ పక్రియ జరపాలి. సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో రంగనాయకులకు బుధవారం సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం అందించారు ట్రాన్స్ఫర్ ప్రక్రియ సీనియారిటీ మెరిట్ జాబితాలు విడుదల చేసి సజావుగా పారదర్శకంగా జరిగే లాగున ఏఒక్కఅభ్యర్థికి నష్టం జరుగకుండా చూడమని అభ్యర్థిస్తున్నాము. సచివాలయ ఉద్యోగులకి రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్ మరియు పెండింగ్ అరియర్ వెంటనే క్లియర్ చేయాలి. నోషనల్ ఇంక్రిమెంట్స్ కొరకు తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయవసిందిగా కోరుచున్నాము. రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా ఏర్పడిన మిగులు సిబ్బందిని ప్రభుత్వం ఏ విధంగా వినియోగించుకుంటుంది అనే విషయం పై స్పష్టత ఇవ్వాలి అలాగే బదిలీ ప్రక్రియలో ఉద్యోగులు సొంత మండలాల్లో పని చేసుకునేందుకు అవకాశం కల్పించాలి.

## "ఇంటి వద్ద బియ్యం పంపిణీ"



బియ్యం పంపిణీ విషయమై మాట్లాడుతున్న తాసిల్దారు శ్రీనివాసులు

డి. హిరెహాళ్, జూన్ 25, (ప్రభాతవార్త)

65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు జూలై నెల రేషను ముందుగా జూన్ నెలలోనే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పవర్ స్టార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులకు 17 జూలై నెల రేషన్ ముందుగానే జూన్ నెలలో 26వ తేది నుండి 30వ తేది మధ్య ఆ ప్రాంతం డీలరు ఇంటివద్దే పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు.ఈ పంపిణీ కేవలం 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగుల కార్డులకు మాత్రమేనని, మిగిలిన కార్డుదారుల లబ్దిదారులకు యదావిధిగా 1వ తేది నుండి రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది



విద్యార్థులకు దుస్తులు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

డి. హిరెహాళ్ జూన్ 25 ( ప్రభాతవార్త )

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని అందుకు నిదర్శనం తల్లికి వందనం, దుస్తులు, బ్యాగులు పంపిణీ నే నిదర్శనమని తెదేపా సీనియర్ నాయకుడు తిప్పేస్వామి పిలుపునిచ్చారు. బుధవారం డి. హిరెహాళ్ మండలం కళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ భారీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంగన్న, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి108 మంది విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెదేపా సీనియర్ నాయకుడు మాట్లాడుతూ విద్యుతోనే అన్ని రంగాలందు అభివృద్ధి సాధ్యమని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని తమ పిల్లలను సక్రమంగా పాఠశాలకు పంపాలని ఆయన కోరారు. విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు సీఎం బాటలో నడుస్తూ విద్యాభివృద్ధికి అవసరమైన పథకాలను ఆచరణలో పెట్టారని విద్యార్థులు చదివే ధ్యేయంగా ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందిపుచ్చుకొని విద్యే పరమావధిగా ముందుకు సాగాలని చదువు పైనే దృష్టి ఉంచి ఉన్నత శ్రేణిలో నిలవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తిప్పేస్వామి, శివయ్య, ధనంజయ, ఉమేష్, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సర్పంచులకు మూడు రోజులు డిజిటల్ స్థాయి శిక్షణ..

కళ్యాణదుర్గం రూరల్ జూన్ 25 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం మండల పరిషత్ కార్యాలయం నందు డిజిటల్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో మహిళా సర్పంచులకు మూడు రోజులపాటు డిజిటల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ధనుంజయనాథ్ తెలిపారు. ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామపంచాయతీ పరిపాలన, విధులు, నిధుల పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ధనుంజయనాథ్ తెలిపారు. ప్రతి మహిళా సర్పంచ్ ఈ శిక్షణ క్రమ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా ప్రతి పంచాయతీ కార్యదర్శి చొరవ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. శిక్షణకు హాజరవుతున్న సర్పంచులు ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ వెంట తీసుకుని రావలెనని తెలిపారు.

## మూడేళ్ల బాలికపై హత్యాచారయత్నం

కుందుర్పి, జూన్ 25, ప్రభాతవార్త

కుందుర్పి మండలం జంబుగుంపల గ్రామంలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన ఓబుల రాజు యువకుడు మూడేళ్ల చిన్నారిపై హత్యాచారానికి యత్నించాడు. ఇంటివద్ద ఆడుకుంటున్న చిన్నారిని సమీపంలోని చెట్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేయబోయాడు. దీంతో చిన్నారి కేకలు వేయడంతో పక్కనే ఉన్న తోట యజమాని పరిగెత్తుకుని రావడంతో అక్కడినుంచి యువకుడు పరారైనట్లు సమాచారం. చిన్నారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు కుందుర్పి పోలీసులు తెలిపారు.

## మాదిగ మహా మేళా సభను జయప్రదం చేద్దాం

### కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కంబదూరు, జూన్ 25, ప్రభాతవార్త

ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో జూలై 7న ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగే మాదిగ మహా మేళా సభను జయప్రదం చేద్దామని ఎమ్మార్పీస్ కంబదూరు మండలాధ్యక్షుడు గంపల రామంజి బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బాలకిషన్ తో కలిసి మాదిగ మహా మేళా సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తర్వాత నిర్వహిస్తున్న ఈ మహాసభకు ప్రజా సంఘాలన్నీ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రామాంజినేయులు ,పెద్దన్న , కుళ్లాయిస్వామి, మంజు, మైలారప్ప, అజిత్, మారుతీ, రవి, బాబు, అందేపల్లి శంకర్, దిలీప్, నాగరాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

హిందూపురం టౌన్ జూన్ 25 ప్రభాతవార్త

హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 21 మంది బాధితులకు బుధవారం 15,00,000 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్, బాలకృష్ణ పిఏలు వీరయ్య, బాలాజీ తదితరులు బాధితులకు చెక్కులను అందజేశారు. సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందడంపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

## వైసీపీ రాష్ట్ర సమీక్షలో ఇంచార్జ్ దీపిక



హాజరైన దీపికా తదితరులు

హిందూపురం జూన్ 25 ప్రభాతవార్త

విజయవాడలోని తాడేపల్లి లో బుధవారం జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశానికి హిందూపురం నుంచి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దీపికా వేణు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత జగన్ ప్రజా సమస్యలపై పోరాడేందుకు అవసరమైన పార్టీ కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించినట్లు దీపిక తెలిపారు.

## 21 మందికి రూ. 15 లక్షలు మంజూరు



సహాయనిధి పత్రాలతో లబ్ధిదారులు

హిందూపురం టౌన్ జూన్ 25 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయ నిధి కింద హిందూపురం నియోజకవర్గంలోని 21 మందికి రూ. 15 లక్షలు సహాయం మంజూరు అయింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన పత్రాలనుఅందజేశారు కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏలువీరయ్య,బాలాజీ, మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు అశ్వర్థరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, మండల కన్వీనర్ రాము మొదలగువారు పాల్గొన్నారు.

## బీఎస్పీ జిల్లా అధ్యక్షులుగా నాగరాజు



నాగరాజు

హిందూపురం టౌన్, జూన్ 25 ప్రభాతవార్త

బహుజన సమాజ్ పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా హిందూపురం పట్టణం కొల్లకుంటకు చెందిన వడ్డే నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గౌతం కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. నాగరాజు తో పాటు మరో తొమ్మిది మంది జిల్లా కమిటీ ప్రతినిధులు ఎంపికయ్యారు. కాగా సినిమా నిర్మాతగా, గత ఎన్నికల్లో బీఎస్పీ తరఫున ఎంపీ అభ్యర్థిగా తన సతీమణిని బరిలోకి దించి పదివేల ఓట్లను సాధించిన నాగరాజుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని కేటాయించింది.

## వేతనాల పెంపు కోసం మున్సిపల్ వర్కర్ల దీక్షలు



నిరసన దీక్షలు దృశ్యం

హిందూపురం జూన్ 25 ప్రభాతవార్త

మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత 49 రోజుల నుంచి రాష్ట్రంలో ఉన్న 70 మున్సిపాలిటీలు సమ్మె చేపట్టగా స్థానిక మున్సిపాలిటీలో బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం శానారిటీ వర్కర్స్ కు జీతాలు పెంచి ఇంజనీర్ వర్కర్స్ కి జీతాలు పెంచుతామని మభ్యపెట్టి మీరు సమ్మెలో పాల్గొనవద్దండి మేము జీతాలు పెంచుతాము అని చెప్పి మమ్మల్ని మోసం చేసిందని వాపోయారు. ఇప్పుడున్న ప్రభుత్వంతో కూడా మొరపెట్టుకున్నా కూడా ఎటువంటి ఫలితం లేదని అందుకు సమ్మెలోకి వెళ్తున్నట్టు వారు ప్రకటించారు.

## ఫేక్ ఈ స్టాంప్ లో మోసపోయిన గార్మెంట్ నిర్వాహకుడు చంద్రశేఖర్

### పోలీసులకు ఫిర్యాదు

కళ్యాణదుర్గం, జూన్ 25 ప్రభాత వార్త :



ఫేక్ ఈస్టాంప్ బాధితుడు చంద్రశేఖర్

కళ్యాణదుర్గం పట్టణంలో ఫర్ లేడీ గార్మెంట్స్ దుకాణం నిర్వాహకుడు ఇటీవల బాబు అలియాస్ ఎర్రప్ప నిర్వహిస్తున్న మీసేవ కేంద్రంలో బ్యాంకు రుణం కోసం రూ.7,500లు చెల్లించి ఈ స్టాంప్ తీసుకున్నట్లు విలేకరులకు తెలిపాడు. ఈ ఈ స్టాంపును బ్యాంకుకు అందజేసి దుకాణం నిర్వహణ కోసం రూ. 15 లక్షల రుణం తీసుకున్నట్లు తెలిపాడు. అయితే ఇటీవల వెలుగు చూసినా మీసేవ బాబు కుంభకోణం సందర్భంగా తన ఈ స్టాంపు వివరాలను పరిశీలించుకోగా కేవలం రూ.150లుగా ఉన్నట్లు తెలుసుకొని కళ్యాణదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బ్యాంకు రుణాల కోసం, ఇతర అవసరాల కోసం ఈ స్టాంపులు తీసుకున్న ప్రజలు రాము కొన్న ఈ స్టాంపులు ట్యాంపరింగ్ జరిగాయో లేదో తెలుసుకునేందుకు కాపత్రయపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులైన తమకు అందజేసిన ఈ స్టాంప్ పేపర్ల వివరాలను గమనించి ఖాతాదారులకు తెలియజేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బయన్నపల్లిలో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

లేపాక్షి, జూన్ 25 ప్రభాతవార్త

మండలంలోని బయన్నపల్లి గ్రామంలో బుధవారం డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచు గంగలక్ష్మమ్మ, సీనియర్ టిడిపి నాయకులు నాగరాజు, చంద్రశేఖర్గౌడ్ తదితరులు భూమిపూజ చేశారు. ఇటీవల 15 లక్షల రూపాయల ఎంపి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో బయన్నపల్లి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే బయనపల్లిలో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన రిజ్వానా, గాయత్రి వైష్ణవి

ఉరవకొండ, జూన్ 25 ప్రభాతవార్త



గాయత్రి వైష్ణవి, రిజ్వానా

ఉరవకొండ పట్టణానికి చెందిన రిజ్వానా, గాయత్రి వైష్ణవి వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పట్టణంలోని ఎస్.కె. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతూ స్థానిక సాయి ట్యుటోరియల్లో శిక్షణ పొందిన రిజ్వానా 10వ తరగతి పరీక్షల్లో 584 మార్కులు, చిన్నముష్టూరులోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చదువుతూ శిక్షణ పొందిన గాయత్రి వైష్ణవి 582 మార్కులు సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు వారు దరఖాస్తు చేసుకోగా ఈనెల 24వ తేదీన అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి ట్యుటోరియల్ సంస్థ కరస్పాండెంట్ రాము విద్యార్థినులను అభినందించారు.

## లత్తవరం, షేక్షానుపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

### -న్యాచురల్ ఫామింగ్ పద్దతిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట పరిశీలన



పొలం పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

ఉరవకొండ, జూన్ 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని లత్తవరం, షేక్షానుపల్లి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. లత్తవరం గ్రామంలో న్యాచురల్ ఫామింగ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బి.రామకృష్ణుడు

పద్దతిలో ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారు చేసిన మందులతో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు పరిశీలించారు. రైతు 3 ఎకరాల్లో పంట సాగు చేస్తుండగా అందులో 1.5 ఎకరాలు న్యాచురల్ ఫామింగ్ పద్దతిలోనూ, మరో 1.5 ఎకరాలను సాధారణ పద్దతిలో సాగు చేస్తుండగా న్యాచురల్ పద్దతిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట ఎదుగుదల బాగా ఉందని గుర్తించారు. మొక్కజొన్న పంటలో ప్రస్తుతం కత్తెర పురుగు బెడద ఎక్కువగా ఉందని దీని నివారణకు నీమాస్త్రం అనే మందును తయారు చేసుకోవాలని ఇందుకు తాజా ఆవు పేడ రెండు కిలోలు, దేశీ ఆవు మూత్రం 10 లీటర్లు, బాగా దంచిన వేపాకులు 10 కిలోలు తీసుకొని 200 లీటర్ల నీటిలో కలిపి 48 గంటలపాటు మురుగబెట్టి గోనె సంచితో కప్పి ఉంచాలన్నారు. రోజుకు రెండుసార్లు ఉదయం, సాయంత్రం కుడివైపుకు కలియతిప్పాలన్నారు. 48 గంటల తరువాత పల్చటి గుడ్డతో వడపోసుకొని సాయంత్రం పూట పంటపై పిచికారి చేసుకోవాలని సూచించారు. తయారు చేసుకున్న ద్రావణాన్ని నెలరోజులలోపు వాడుకుంటే మంచి ఫలితం ఉంటుందని, నీమాస్త్రం రసం పీల్చే పురుగులు, ఇతర చిన్న చిన్న పురుగులు పెట్టిన గుడ్లను సైతం పొదగనీయకుండా నివారిస్తుందన్నారు. నీమాస్త్రంను 200 లీటర్లు ఒక ఎకరాకు వాడాల్సి ఉంటుందని వివరించారు. పురుగుల మందులకు బదులు ప్రకృతి వ్యవసాయంలో తయారు చేసిన మందుల వాడకంవల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కంది పంటను జూలైలో వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు పంటలపై జింకల దాడులు అధికమయ్యాయని వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. షేక్షానుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో వేసవిలో సాగు వేసిన 90 రోజులు వయసుగల వేరుశెనగ పంటను పరిశీలించి జింకు లోపాన్ని, ఇనుపదాతు లోపాన్ని, పచ్చదోమను గుర్తించారు. పచ్చదోమ నివారణకు ఫార్ములా 4, ఆమిడాకులప్రేడ్ మందు ఒక ఎంఎల్ను ఒక లీటరు నీటిలో కలిసి పిచికారి చేసుకోవాలన్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు రైతులకు వేరుశెనగ, పత్తి, ఆముదం పంటలకు ఇన్సూరెన్స్పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షులు విజయభాస్కర్, రైతులు చలపతి, నరేష్, కేశన్న, సన్నప్పయ్య, కరీం, రామాంజినేయులు, శ్రీనివాసులు, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

## బిసలమనేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఒ

లేపాక్షి, జూన్ 25 ప్రభాతవార్త

మండలంలోని చోళసముద్రం, బిసలమనేపల్లి గ్రామాల్లో బుధవారం ఏఒ శ్రీలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగులో మెళకువలను రైతులకు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏఒ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించే విధానాన్ని వివరించారు. వేరుశనగ విత్తనశుద్ధి, అంతర్ పంటల యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి తెలియచేశారు. ఎరువుల వినియోగం, పంటల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. డ్రోన్ స్ప్రేయర్ యొక్క ఉపయోగాలు తెలియచేశారు. అదేవిధంగా వ్యవసాయశాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాలక్క, ఏఇఒ అమరేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

